
ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 18 పుష్పం : 49-51 05-06-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 20
VOL : 7 ISSUE : 18

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278
05-06-2002

## పరాభక్తికి మరోపేరే సమాధి

భక్తుడు మొదట భగవంతుణ్ణి కోరికలు కోరతాడు - కొంతకాలానికి యీ కోరికలలో విలువ లేదని తెలుసుకుంటాడు. జరుగుతున్నది అంతా పరమేశ్వరుని "లీల" అనుకొంటాడు. పరమేశ్వరుని మీద కారణం లేకుండానే ఇష్టం కలగటం చాలు అనుగ్రహం దాని అంతట అది వస్తుంది. కళ్ళతో చూచేది, మనస్సుతో సంకల్పించుకొన్నదానిలో సత్యం లేదు. వాటితో మనం పరమేశ్వరుణ్ణి తెలుసుకోలేము. భక్తి అనే జలంతో అహంకారాన్ని ప్రక్షాళన చేసిన తరువాత మాత్రమే జ్ఞానం ఇవ్వబడుతుంది. అప్పుడు మాత్రమే ఆధ్యాత్మిక వికాసం సంభవిస్తుంది. నిజభక్తుడు "నన్ను నీలో కలుపుకో" అంటాడు. పరిపూర్ణ భక్తిలో రాగ-ద్వేషాల రాపిడి ఉండదు. "నీ సంకల్పమే నా సంకల్పం - నీ ఇష్టమే నా ఇష్టం" అంటాడు - అక్కడ ఆరాటం, వేదన ఉండదు. వైదిక భక్తి కన్నా ప్రేమ భక్తి మంచిది, దీనికి ప్రహ్లాదుడు, సూరదాస్, మీరా ఉదాహరణలు. భక్తి మార్గంలో భగవంతుడు తన కన్నా వేరు అని అనుకొంటే గాని ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్ళలేదు. ద్వైతం - అద్వైతానికి దారి తీస్తుంది. ఉపాసన లేకుండా వాసన నశించదు. భక్తి బాధ్యతలను నేర్పుతుంది. భక్తిలేని విచారణ, యోగాల ప్రయోజనం అంతంత మాత్రమే. "శ్రద్ధ"లోంచే భక్తి జ్ఞానం వస్తుంది. చంటిపిల్ల ఆటవస్తువులైన బొమ్మలతో ఆడుకొన్నంతసేపు తల్లి తన పని చూసుకొంటూ బిడ్డను పట్టించుకోదు - కాని పిల్లవానికి బొమ్మలతో విసుగు పుట్టి వాటిని విసిరివేసి "అమ్మా - అమ్మా" అంటూ గుక్కపెట్టి ఏడుస్తూ ఉంటే, ఆ తల్లే ఉడికే ఉడికే అన్నాన్నైనా ప్రక్కన పెట్టి పరుగుపరుగున వచ్చి గుండెలకు హత్తుకొంటుంది (దీనికి ప్రతీక గజేంద్రుడు, ద్రౌపతి) అలాగే మనం, మన ప్రాపంచిక సంబంధాల నుంచి విముఖత కలిగి భగవంతుడు ఒక్కడే కావాలనే తపన కలిగినప్పుడు హృదయ కవాటాలు తెరుచుకొని పరమాత్మ దర్శనం కలుగుతుంది. ఒక ఒరలో రెండు కత్తులు యిమడవు మనం దేవుడనో లేక అహంకారమనే పిశాచాన్నో కోరుకోవాలి. గురువు మీద నిజమైన ప్రేమ ఎలా కలగాలంటే మండుటెండలో దాహం గొన్నవానికి నీటిమీద ఎంతప్రేమ ఉంటుందో, ఒడ్డున పడ్డ చేపకు నీటికోసం ఎంత క్షోభ అనుభవిస్తుందో అలాంటి తపన మన హృదయం నుండి వస్తే అంతరంగ మార్గం తెరుచుకుంటుంది. గురువుతో సన్నిహితం పెంచుకొన్నవారే ఉత్తములు. అలాంటి ప్రేమికులే, కడు దీనంగా వారిని యిలా ప్రార్థిస్తారు. "ఓ పరమాత్మా, నేను నీ దాసుణ్ణి, యీ దాసుని ప్రార్థన స్వీకరించి నాకు నీ దర్శన భాగ్యం ఎప్పుడూ కలిగించు" అంటారు. లోహాలు పూర్తిగా కరిగితేగాని మూసలో పోయబడవు అంటే సుందరరూపానికి అవకాశం ఉండదు అలాగే మనలో నిజమైన తపన, పరిపూర్ణ ప్రేమ విశ్వాసాలు గురువుమీద కలగనంతకాలం, సంస్కారాలు రహితం కానంతకాలం మన అజ్ఞాన జనితమైన తెరను గురువు తొలగించరు. గురువు ఎడల భక్తిని రహస్యంగా ఉంచుకోవాలి. గురువును మనం ప్రేమించిన దానికన్న అధికంగా గురువు మనలను ప్రేమిస్తారు వారు చేసే సహాయం మన బుద్ధికి అందదు. వ్యాపారం చేసే అలవాటు ఉన్నవాడు వ్యాపారంలో నష్టం వచ్చినా లాభం వచ్చినా వదలడు అలాగే భక్తుడు ముక్తి కోసం ఎదురు చూడడు, నిరాశ చెందడు. గురువుమీద భక్తి వదలడు. దానివల్లనే మనం గమ్యాన్ని చేరుతాము.

**సాగిరాజు రామకృష్ణంరాజు**
అర్ధవరం

**ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

19-05-2002 జిన్నూరు ........ 3
23-05-2002 నార్నిమెరక ........ 9
19-04-2002 రావులపాలెం ........ 15

Visit us @ www.srinannagaru.com

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-05-2002, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనస్సు అణిగినప్పుడు మనకు శాంతిగా ఉంటుంది. అది నిజంకాదు. మరల మనస్సు విజృంభించినప్పుడు అశాంతి వచ్చేస్తుంది. మన స్వరూపమే శాంతి, మన హృదయంలో ఉన్నదే శాంతి. అహంభావనను తగ్గించుకోవటం వలన, బుల్లి నేనును తొలగించుకోవటం వలన మనకు శాంతి కలుగుతుంది. మనకు కోరిక వలన అశాంతి వస్తుంది, భయం వలన అశాంతి వస్తుంది, ఇతరులను చూసి ద్వేషపడటం వలన కూడా అశాంతి వస్తుంది. మనకు అశాంతి వస్తూ ఉంటే అది బయట కారణాలవలన వస్తోంది అని మనకు అనిపిస్తుంది కాని మనబుద్ధిలోని దోషాల వలన మనకు అశాంతి వస్తుంది. ఇతరులు ఎవరైనా మనలను ద్వేషిస్తున్నారు అనుకోండి, మనకు కూడా వారిని ద్వేషించాలనిపిస్తుంది. ఇతరులు మనలను ద్వేషిస్తూ ఉన్నా మనం వారిపట్ల ద్వేషం లేకుండా ఉండగలిగితే మనకు అశాంతిరాదు. మనకు పెద్దవయస్సు వస్తోంది, ముసలితనం వస్తోంది మనలను సరిగా చూస్తారో, చూడరో అని భయపడటం వలన కూడా అశాంతి వస్తుంది. మీ చుట్టాలకంటే, స్నేహితుల కంటే, మీ శరీరం కంటే, మీ మనస్సులో వచ్చే ఆలోచనలకంటే అత్యంత సమీపంలో మీ ప్రాణానికి ప్రాణం అయి, మనస్సుకు మనస్సుఅయి మీ హృదయంలోనే భగవంతుడు ఉన్నాడు. అందరి హృదయాలలో భగవంతుడు ఉన్నప్పటికి, భగవంతుడు ఎక్కడో లేడు మన హృదయంలోనే ఉన్నాడు అనే విశ్వాసం మనకు కలగటంలేదు, ఆ విశ్వాసం మనం కాపాడుకోవాలి. మీరు వెయ్యి ఎకరాలు సంపాదించి ఇచ్చినా, ఎంత డబ్బు సంపాదించి ఇచ్చినా మీ శరీరం చనిపోయిన తరువాత మీకూడా ఎవరూ రారు. శరీరం మరణించిన తరువాత మనకూడా వచ్చేవాడు మన హృదయంలో ఉన్న భగవంతుడు మాత్రమే. మరణానంతరం మనకూడా వచ్చేవాడి మీద మనకు అసలు కృతజ్ఞత లేదు, భక్తిలేదు, ప్రేమలేదు. దీనికి మనబుద్ధిలో ఉన్న దోషం కారణం. మన హృదయంలో ఉన్న ఈశ్వరుడిమీద మనకు విశ్వాసం కుదిరితే భయం తగ్గిపోతుంది.

ఉదయం లేచినది మొదలు రాత్రి పడుకొనే వరకూ మనం నేను, నేను అంటాము. నీటి వాడకం కంటే ఈ నేనును ఎక్కువ వాడతాము. ఇంత ఎక్కువగా మనం నేను, నేను అంటున్నాము, ఈ నేను గురించి రవ్వంతయినా, ముల్లంత అయినా తెలుసుకొందామనే ప్రయత్నం ఈ శరీరంలో ప్రాణం ఉన్నంతసేపు చేయటం లేదు. 100 సంవత్సరాలు ఒక మనిషి బ్రతికితే 100 నిమిషాలు కూడా ఈ నేను గురించి విచారణ చేయటం లేదు, ఇదే మాయ, ఇదే అజ్ఞానం, ఇదే తెలివితక్కువతనం, ఇంతకంటే తెలివితక్కువతనం ఏమి ఉంటుంది? యోగవాశిష్ఠంలో ఒక కథ ఉంది. ఒకరి ఇంటికి వెళ్ళి తలుపు తడతారు. లోపలనుండి ఎవరువారు అంటారు. బయటనుండి నేను అంటాడు. తలుపు తీయబడదు అంటారు. వీడు వెళ్ళిపోయి మరల నాలుగురోజులు తరువాత వచ్చి మరల తలుపు తడతాడు. లోపలనుండి ఎవరువారు అంటారు. నేను అంటాడు, తలుపు తీయబడదు అంటారు. మరల పదిరోజుల తరువాత వచ్చి తలుపుతడతాడు. మరల లోపలనుండి అదే ప్రశ్న ఎవరువారు అంటారు. ఈసారి నువ్వే అంటాడు. అప్పుడు తలుపు తెరువబడుతుంది. దీని అర్థం ఏమిటి అంటే ఉన్నది దేవుడే, నేను అనేది లేదు. కాని మనం ఏమనుకొంటున్నాము అంటే దేవుడు లేడు మనం ఉన్నాము అనుకొంటున్నాము. వాడు ఎప్పుడు తలుపులు తీసాడు అంటే ఎవరువారు అంటే నువ్వే అన్నప్పుడు తలుపులు తీసాడు, అలాగే ఉన్నదంతా దేవుడే అనే అనుభవం నీకు వచ్చినప్పుడు వైకుంఠానికి వెళ్ళే ద్వారాలు తెరుచుకుంటాయి.

శరీరానికి ఎన్ని రోగాలు వచ్చినా ఆరోగాలు తగ్గిపోయేమందు నీ దగ్గర ఉన్నప్పుడు నీకు ఏమీ ఇబ్బంది లేదు అలాగే నీకు ఎన్ని రకాల భయాలు ఉన్నా, దుఃఖాలు ఉన్నా కంగారుపడవద్దు. నీ హృదయంలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిమీద నమ్మకం కుదిరితే, వాడిని పూర్ణంగా, హృదయపూర్వకంగా నమ్మటం నేర్చుకొంటే నీ భయాలు, దుఃఖాలు అన్నీ నశిస్తాయి. నీ హృదయంలో భగవంతుడు ఉన్నప్పుడు నీకు భయం ఎందుకు? మీకు భగవంతుడిమీద విశ్వాసం లేకపోవటం వలన భయం వస్తోంది, దుఃఖం వస్తోంది, అశాంతి వస్తోంది. నీ ప్రభువు మీద నీకు విశ్వాసం లేకపోవటం వలన ఇదంతా వస్తోంది. బాగుపడేవాడి లక్షణాలు ఎలా ఉంటాయి అంటే వాడు పైకిఎలా కనిపించినా లోపల నిరంతరం ఈశ్వరస్మరణలో ఉంటాడు, చేతనయితే సమాజానికి ఉపయోగపడతాడు లేకపోతే నోరుమూసుకొని కూర్చుంటాడు. ఇంట్లో నలుగురు వ్యక్తులు ఉన్నారు అనుకోండి. అందులో దేవుడు ఉన్నాడు అని చెప్పేవారు ఉంటారు, దేవుడు లేడు అని చెప్పేవారు ఉంటారు. బాగుపడేవాడి లక్షణం ఏమిటి అంటే ఇంట్లో అందరితోపాటు తిరుగుతూ నటిస్తూ ఉంటాడు, దేవుడు లేడు అని చెప్పేవారితో సహవాసం చేయడు. వారితో సహవాసం చేయటం వలన వీడికి కూడా నమ్మకం పోతుంది. అందువలన అందరితోపాటు కలిసిఉన్నట్లు నటిస్తూ వాడి దారివాడు చూసుకొంటాడు. శాస్త్రం ఏమి చెపుతోంది అంటే దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడు సత్పురుషుడు, వాడు దేవుడులేడు అని చెప్పేవారితో సహవాసం తగ్గించుకోవాలి అంతేగాని

వారితో పేచీలు పెట్టుకోకూడదు.

మన కళ్లకు కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతా ఎక్కడ నుండి వచ్చింది అని భగవాన్‌ను అడిగితే నువ్వు ఎక్కడ నుండి వచ్చావో అదికూడా అక్కడ నుండే వచ్చింది. కిరణాలు అన్నీ సూర్యుడు నుండే వచ్చాయి అలాగే ఈ జీవకోటి, పంచభూతములు, ఈ సృష్టి అంతాకూడా ఈశ్వరుడులో నుండే వచ్చింది. భగవంతుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు మరి మీరువేరు, నేనువేరు అనే బుద్ధి ఎందుకు వస్తోంది అంటే దేహంతో ఏ నేను అయితే తాదాప్యం పొందుతోందో ఆ నేనే వేరుబుద్ధికి, దేహబుద్ధికి కారణం. మనస్సులో ఉన్న గుణాలను బట్టి మనుషులలో తేడా వస్తుందిగాని లోపల హృదయంలో అందరూ సమానమే. మనస్సు నిజంకాదు. ఈ రోజు మంచిగా ఉన్నవారు రేపు చెడ్డవారు అవ్వవచ్చు, ఈరోజు చెడ్డగా ఉన్నవారు రేపు మంచివారు అవ్వవచ్చు. ప్రేమించేవారితో సహవాసం చేస్తే ప్రేమ నేర్చుకొంటాము, ద్వేషించేవారితో సహవాసం చేస్తే ద్వేషం నేర్చుకొంటాము ఇవన్నీ నిజంకాదు, మనస్సు నిజంకాదు, శరీరం నిజంకాదు, మంచి చెడ్డలు నిజంకాదు. ఇవన్నీ ఉపాధికి సంబంధించిన విషయాలు. ఇది అంతా ఒక్క చైతన్యంలోనుండి వచ్చింది. ఉన్నది ఒక్కటే. అదే బ్రహ్మం, అదే చైతన్యం. అది ఎప్పడూ ఉంటుంది. అది జ్ఞానపూరితం, శాంతిపూరితం. ఉన్నది ఒక్కటే అది అనేకంగా కనిపించటానికి నీ అజ్ఞానం కారణం, అహంభావన కారణం, దొంగనేను కారణం, ఈగనేను కారణం. ఈ దొంగనేనును, మిధ్యానేనును ఈగనేను అని ఎందుకు అంటారు అంటే ఈగ ఒకసారి ఏనుగుమీద కూర్చుని వెళుతూ ఉంటుంది. అప్పడు ఈగ ఈఏనుగును నేనే నడుపుతున్నాను, నేను లేకపోతే ఈ ఏనుగు నడవలేదు అంటుంది. ఏనుగు మీద కూర్చుని ఏనుగువలన అది ప్రయాణం చేస్తూకూడా, నావలననే ఏనుగు నడుస్తోంది అంటుంది. ఆ ఈగలాగే మనలో ఉన్న మిధ్యానేను కూడా అది ఏ చైతన్యంలో నుండి వచ్చిందో దానిని మర్చిపోయి నావలననే ఈ సృష్టి అంతా నడుస్తోంది, ఈ సంసారం అంతా నేనే నడుపుతున్నాను, నేను లేకపోతే వీరందరూ ఏమైపోతారు అంటుంది.

మనలో రెండు నేనులు ఉన్నాయి. చైతన్యం అంతటా ఉంది. అది మన హృదయంలో నిజమైన నేనుగా వ్యక్తమవుతోంది. దానికి దేహానికి ఇసుమంతయు సంబంధం లేదు, దానికి పరిమితులు లేవు. మనకు దేహాన్ని బట్టి పరిమితులు వస్తున్నాయి. ఈ పరిమితులను, ద్వంద్వాలను కల్పించేది దేహగతమైన నేను. ఇదే దొంగనేను, మిధ్యానేను. మనకు నిజమైననేను తెలిస్తే ఈ దొంగనేను ఉండదు, ఈ దొంగనేను పోతేగాని ఆనేను తెలియదు. రెండులోనుండి భయం వస్తుంది, ద్వేషం వస్తుంది, కోపం వస్తుంది అన్నీ వస్తాయి. ఉన్నది





ఒక్కటే అని నీకు తెలిస్తే ఏమీలేదు. ఉన్నది ఒక్కటే. నీ అజ్ఞానం వలన అదే నీకు అనేకంగా కనిపిస్తోంది. నీ అజ్ఞానం వలన దేవుడే జీవుడిగా కనిపిస్తున్నాడు. ఏ కారణం వలన నీకు దేవుడు జీవుడిగా కనిపిస్తున్నాడో ఆ కారణాన్ని తీసేస్తే ఎవరు మిగులుతారు? ఈశ్వరుడే మిగులుతాడు, చైతన్యమే మిగులుతుంది. అప్పడు అంతా నీవే, నీకంటే భిన్నంగా ఏమీ కనిపించదు. అప్పడు నీవు ఎవరిని చూసి భయపడతావు, ఎవరిని ద్వేషిస్తావు. మనం అహంభావనను ఎందుకు తొలగించుకోలేక పోతున్నాము అంటే అదే నేను అనుకోవటం వలన, అదే సర్వస్వం అనుకోవటం వలన దానిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయటం లేదు. మనలో ఉన్న అహంభావనే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. ఆనేను యొక్క వాడకం తగ్గించుకోవాలి. దానిని తొలగించుకోవాలి అంటే మనం సత్వగుణాన్ని పెంచుకోవాలి. సత్వగుణాన్ని ఎవరైతే పెంచుకొంటున్నారో వారు మిధ్యానేనులోనుండి విడుదల పొందగలరు. భారతయుద్ధం మనలో జరుగుతోంది. సత్వగుణాన్ని అణిచివేయాలని రజోగుణం చూస్తుంది. ఈ రెండు గుణాలను అణిచివేయాలని తమోగుణం చూస్తుంది. ఈ పోరాటం మనలో ఎప్పడూ జరుగుతూ ఉంటుంది. నీవు సత్కర్మ ఎలా చేయాలంటే బాగా ఆకలిగా ఉన్నప్పడు అన్నం తింటే మనస్సు చల్లబడుతుంది, శాంతిగా ఉంటుంది అలాగే నీవు చేసే సత్కర్మ వలన నీ మనస్సు చల్లబడాలి, నీకు శాంతి కలగాలి. సత్కర్మ కూడా నిర్మలంగా చేయాలి, ఏకాగ్రతతో చేయాలి. భగవంతుడి పట్ల మనకు ఎంత ప్రేమ ఉందో, ఎంత భక్తి ఉందో అంతే ప్రేమతోటి, భక్తితోటి మనం సత్కర్మ చేయాలి. దానివలన మనకు సత్వగుణం వస్తుంది. అంతేగాని మనం గొప్పలకోసం సత్కర్మ చేయకూడదు. గొప్పలకోసం చేస్తే రజోగుణం పెరుగుతుంది. గొప్పలకోసం కాకుండా ప్రేమతో, భక్తితో చేస్తే సత్వగుణం పెరుగుతుంది.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. అది నీకు అనుభవంలోనికి వచ్చే వరకూ నీకు బేధం కనిపిస్తుంది. బేధం నిజంగా ఉందా అంటే లేదు. నీ హృదయంలో ఉన్న నిజం అనుభవంలోనికి వచ్చే వరకూ నీ అజ్ఞానం వలన నీకు బేధం కనిపిస్తుంది. అక్కడ నుండి భయం, అసూయ, ద్వేషం, పునర్జన్మలు అన్నీ వస్తాయి. బేధబుద్ధి నశించి నీకు అబేధబుద్ధి కలిగేవరకు నిన్ను భయం, ద్వేషం, అశాంతి విడిచిపెట్టవు. మనం పెద్దపెద్ద విషయాల వరకు వెళ్లనక్కరలేదు, చిన్న చిన్న విషయాలు నేర్చుకొంటే చాలు. నేను ఎవరితోనైనా మాట్లాడుతూ ఉంటే మధ్యలో మీరు మాట్లాడకూడదు, ఆ మాటలు పూర్తిఅయిన తరువాత మీరు మాట్లాడాలి. చాడీలు చెప్పకూడదు. ఇక్కడ మాటలు అక్కడ, అక్కడ మాటలు ఇక్కడ చెప్పకూడదు. చాడీలు చెప్పటం వలన నీలోపల అజ్ఞానం పెరుగుతుంది. చాడీలు చెప్పటమే తగ్గనప్పడు ఇంక

పరమేశ్వరుడి మీద భక్తి ఎలా వస్తుంది. మనం ఇటువంటి చిన్న విషయాలనే నేర్చుకోలేకపోతున్నాము ఇంక మిధ్యానేనును ఎలా పోగొట్టుకోగలము. చిన్నచిన్న విషయాలలో క్రమశిక్షణ లేనప్పుడు, మన జీవిత విధానం సక్రమంగా లేనప్పుడు మనకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. మన ప్రవర్తన సరిగా ఉండాలి. మనం టైమును పాడుచేసుకోకూడదు. చాడీలు చెప్పకూడదు అనే చిన్న విషయం అర్థంకాని వారు అహంభావనను ఎలా పోగొట్టుకోగలరు.

కోపం, ఉద్రేకం, అసూయ అనే జ్వరం ముందు మనకు తగ్గాలి. ఇది మనస్సుకు వచ్చే జ్వరం. శరీరానికి వచ్చే జ్వరం కంటే మనస్సుకు వచ్చే జ్వరం ప్రమాదం. శరీరానికి వచ్చే జ్వరం తగ్గకపోతే ఆ శరీరం మరణించినప్పుడు జ్వరం పోతుంది. కాని మనస్సుకు వచ్చే జ్వరం తగ్గకపోతే అది రాబోయే జన్మలోకూడా కంటిన్యూ అవుతుంది. అందువలన నీ మనస్సుకు వచ్చిన జ్వరం ముందు తగ్గించుకో. మనస్సులో జ్వరం ఉన్నప్పుడు మాట్లాడితే మంచి మాటలురావు, ఆ మాటల వలన నాకు నేను అశాంతి తెచ్చుకోవటం, మీకు అశాంతి కలుగజేయటం. అందువలన మనస్సులో ఉన్న జ్వరం ముందు తగ్గించుకో. భగవంతుడే ఉన్నాడు, మనం లేము అనుకోవటం సదాచారం. భగవంతుడు లేడు మనం ఉన్నాము అనుకోవటం దురాచారం. మీరు సదాచారం ఉన్నవారితో స్నేహం చేయండి, దురాచారం ఉన్నవారితో స్నేహం వద్దు అని శ్రీకృష్ణచైతన్య చెప్పారు. నీవు ఎన్ని యోగాభ్యాసాలు చేసినా హృదయంలో ఉన్న ప్రభువు మీద ప్రేమ లేకపోతే, భక్తి లేకపోతే నీవు ఆయనను పొందలేవు. ఒక వ్యక్తి ఎంతమంచివాడు అయినా వాడికి భగవంతుడి మీద విశ్వాసం లేకపోతే వాడితో సహవాసం పనికిరాదు అని చెప్పారు.

నాకు శాంతి ఎలా కలుగుతుంది అని అడిగితే నీ స్వరూపమే శాంతి, నీ హృదయంలో ఉన్నదే శాంతి, శాంతే నీ సహజస్థితి. నీలోపల నిజంగా శాంతి ఉంది కాబట్టి నాకు శాంతి కావాలి అని కోరుకొంటున్నావు. నీవు అదే అయి ఉన్నావు. అందుచేత నీకు తెలియకుండా నిన్ను నీవే కోరుకొంటున్నావు. మీరు ఎప్పుడు జ్ఞానంలో ప్రవేశిస్తారు అంటే మన దేహప్రారబ్దమును బట్టి కష్టాలు వస్తూ ఉంటాయి, సుఖాలు వస్తూ ఉంటాయి, మంచి వస్తుంది, చెడు వస్తుంది, చలి వస్తుంది, వేడి వస్తుంది, ఇలా దేహప్రారబ్దమునుబట్టి ద్వంద్వాలు వస్తూ ఉంటాయి. ఈ ద్వంద్వాలు వస్తున్నప్పుడుకూడా వాటిని సహించి, నువ్వు వికారం లేకుండా ఉండగలిగితే, మనస్సును సమానంగా ఉంచుకోగలిగితే అప్పుడే నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడి దయకు పాత్రుడవుతావు, అప్పుడు ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, అదే మోక్షం. ప్రతీచిన్న





విషయానికి నువ్వు రియాక్టు అవ్వవద్దు. నువ్వు ఇతరులను రియాక్టు చేయవద్దు. ఒకసారి కృష్ణుడు, అర్జునుడు ఒక నది ప్రక్కన కూర్చుని రామాయణం మాటలు చెప్పకొంటున్నారు. రాముడు వారధి కట్టినప్పుడు బాణాలతో కట్టవచ్చుకదా, రాళ్లతో కట్టటం ఎందుకు అని అర్జునుడు కృష్ణుడితో అంటాడు. అప్పుడు వానర సైన్యం ఉండేది, వారు బలిష్టులు. బాణాలతో కట్టిన వంతెన ఆగదేమోనని రాళ్లతో కట్టి ఉండవచ్చు అంటాడు కృష్ణుడు. ఎంత బలిష్టులు అయినా బాణాలతో కడితే వెళ్లిపోవచ్చుకదా అంటాడు అర్జునుడు. ఆయనకు తెలియకుండానే నేను గొప్ప వీరుడను అనే భావన అర్జునుడిలో ఉంది, అది పరమాత్మకు తెలుసు. అది ఆయనలోనుండి పోగొట్టాలి. అప్పుడు కృష్ణుడు అర్జునుడితో, అప్పుడు ఉన్న వానరసైన్యం ఇప్పుడు లేదు. కాని ఒక ముసలి వానరుడు ఉన్నాడు. వాడిని పిలుస్తాను. నీవు ఈ నదికి బాణాలతో వంతెన కట్టు అంటాడు. అర్జునుడు బాణాలతో వంతెన కట్టాడు. కృష్ణుడు ముసలి వానరమును పిలిపించి వంతెనపై నుండి అటునుండి ఇటు వెళ్లమని చెపుతాడు. ఆయన ఒక్క అడుగువేస్తే వంతెన కూలిపోయింది. అప్పుడు కృష్ణుడు చెపుతాడు ఆయన ఎవరు అనుకొంటున్నావు? ఆంజనేయస్వామి అని అర్జునుడికి చెపుతాడు. అర్జునుడు ఆంజనేయస్వామి యొక్క ఔన్నత్యం గుర్తించి రాబోయే భారతయుద్ధంలో నా రథం యొక్క జెండా మీద ఉండి, నేను శత్రుసంహారం చేసేటప్పుడు నాకు సహకరించమని ఆంజనేయస్వామిని కోరతాడు. భగవంతుడు చేసిన పనిచూడండి. ఒకే విషయంలో అర్జునుడికి గర్వభంగం అయ్యింది, అదే టైములో యుద్ధంలో అర్జునుడికి సహాయంగా ఆంజనేయస్వామిని నిలబెట్టినట్లు అయ్యింది, వాడు దేవుడు.

ఒక సైన్యాధిపతి ఉండేవాడు. ఆయన ఎక్కువగా కృష్ణుడిని స్మరించుకొంటూ ఉండేవాడు. ఒకసారి యుద్ధం వచ్చింది అప్పుడు ఆయన కృష్ణుడితో నేను విశ్రాంతిగా ఉన్నప్పుడు కృష్ణా, కృష్ణా అని నిన్ను స్మరించుకొంటున్నాను. కాని ఇప్పుడు నేను యుద్ధానికి వెళుతున్నాను. యుద్ధం చేసేటప్పుడు మటుకు నిన్ను స్మరించే శక్తి నాకులేదు, ఒకేసారి రెండు పనులు చేసే భక్తిగాని, శక్తిగాని నాకులేవు. యుద్ధంలో నేను ఓడిపోవచ్చు, నెగ్గవచ్చు, చనిపోవచ్చు, బ్రతకవచ్చు. నా ప్రాణం కాపాడమని, నాకు జయం కలుగజేయమని నేను కోరుకోవటంలేదు. నేను నిన్ను ఒక్కటే కోరుకొంటున్నాను. యుద్ధం చేసేటప్పుడు నేను నిన్ను పూర్తిగా మర్చిపోయినా, నీవు మాత్రం నన్ను మర్చిపోకుండా ఉండు, అదే నా ప్రార్థన, అదే నేను నిన్ను కోరుకొంటున్నాను అంటాడు. ఇది నిజమైన భక్తుడి లక్షణం. నీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. నీకు కష్టాలు వచ్చినప్పుడు, నీవు ఇతరులతో పీడించబడేటప్పుడు అంతర్యామి అయిన పరమేశ్వరుడితో

చెప్పుకో.  అప్పుడు ఆయన దయ కలుగుతుంది, నీవు శారీరక అనారోగ్యం నుండి, మానసిక అనారోగ్యం నుండి విడుదల పొందుతావు.  నీలోపల ఆనందం ఉంది.  నీవు ఆనందంలోనే ఉన్నావు.  కాని నేను ఆనందంలో లేను అనేభావన తీసుకొని వచ్చేది నీ మనస్సే.  అందులోనుండి బయటపడలేకపోతున్నావు అందుచేత నీకు శాంతి దొరకటం లేదు.  నీ మనస్సును చూసుకోవటం లేదు.  నీవు అందరి మనస్సులు చూస్తున్నావు.  మనస్సును విశ్లేషణ చేస్తే మనస్సు అంటూ ఏమీలేదు అని నీకు తెలుస్తుంది.  మనస్సులో ఉన్న రాగద్వేషములను తీసేయండి అప్పుడు మనస్సు అంటూ లేదు.  లోపల ఉన్న మనస్సే మనకు నేనుగా వ్యక్తమవుతోంది.  ఈ నేను ఎక్కడ నుండి వచ్చింది అని విచారణ చేస్తే చైతన్యంలో నుండి వచ్చింది అని తెలుస్తుంది.  మీరందరూ వచ్చిన దారిని తిరిగి వెళ్ళిపోతే ఎలా మీ ఇంటికి వెళ్ళిపోతారో అలాగే నేను అనే తలంపు భగవంతుడిలోనుండి వచ్చింది కాబట్టి దానిని పట్టుకొని దానిమూలం లోనికి వెళితే భగవంతుడిలో ఐక్యమయిపోతాము.  అప్పుడు ఆనందమే ఆనందం, శాంతే శాంతి, ఎటుచూసినా సుఖమే.  అప్పుడు దేహం ఉన్నా, లేకపోయినా ఒక్కటే నీకు భేదమే తెలియదు.

ఈశ్వరుడిని స్మరించుకో, ఈశ్వరుడిని ధ్యానించుకో, సమాజం యొక్క క్షేమం కోరుకో, ఎవరికి అపకారం తలపెట్టవద్దు.  ఇవి బాగుపడే వాడి లక్షణాలు.  వారు ఎటువంటివారు, వీరు ఎటువంటివారు అని పరిశోధన చేస్తున్నావు.  నీ మనస్సు ఎటువంటిదో నీవు ఎందుకు పరిశోధన చేయటంలేదు.  ఎదుటివారి గురించి విచారణ చేసే బదులు నీ మనస్సును విచారణ చేసుకో.  భగవంతుడు కాలరూపంలో ఉన్నానని చెపుతున్నాడు.  అందువలన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి.  ఉన్నది ఒక్కటే అది శాశ్వతం, నీ మనస్సుతో కల్పించేది ఏదీ శాశ్వతం కాదు.  ఏదైతే ఎప్పుడూ ఉందో అదే సత్యవస్తువు, అదే జ్ఞానం, దాని స్వరూపమే శాంతి, ఆనందం, ఉండటం.  బజారులో డబ్బు పెట్టి వస్తువులు ఎలా కొనుక్కొంటున్నారో అలా కొంతమంది మనుషులు చావును కొనుక్కొంటున్నారు.  ఏ వస్తువు అయితే ఎప్పడూ ఉందో దానిని స్మరించటం మానివేసి, ధ్యానించటం మానివేసి నిరంతరం రాగద్వేషముల మధ్యన ఊగిసలాడుతూ, అవసరంలేని స్నేహాలు చేస్తూ, ఇహానికి, పరానికి పనికిరాని తలంపులను బుర్రలోనికి తెచ్చుకొంటున్నాము.  ఇంక మనకు శాంతి ఎలా తెలుస్తుంది.  నీ ప్రభువును చింతించటం మానివేసావు, నిరంతరం దేహాన్ని, లోకాన్ని చింతిస్తున్నావు, విషయాలను చింతిస్తున్నావు.  వీటి అన్నింటి ద్వారా నీవు ఏమి చేస్తున్నావో నీకు తెలియటంలేదు, చావుని కొనుక్కొంటున్నావు.  ఒక్క ఆత్మచింతన తప్ప దేనిని చింతించినా నీవు కొనుక్కొనేది దేవుడిని కాదు, చావుని కొనుక్కొంటున్నావు.  అది నీకు అర్థంకావటం లేదు.  నీవు చావటానికే





బ్రతుకుతున్నావు గాని అమృతానుభవం పొందటానికి బ్రతకటం లేదు.

నాకు మనోమూలంలోనికి వెళ్ళాలని ఉంది కాని ఈ మనస్సే అడ్డు వస్తోంది అంటున్నారు.  ఏది అడ్డువస్తోందో దానిని తొలగించుకోవటానికే సాధన, లేకపోతే నీకు సాధనతో పని ఏముంది.  మనస్సు అణగటం వేరు, మనస్సు నశించటం వేరు.  కొంతమంది మనస్సు అణిగినప్పడు జ్ఞానానికి జానెడు దూరంలో ఉన్నాము అనుకొంటారు కాని అది ఎప్పడో విజృంభిస్తుంది కోటిజన్మలు ఎత్తినా మనకు మోక్షం రాదు అన్నట్లు విజృంభిస్తుంది.  అందువలన మనస్సు విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, అది నశించే వరకు దానిని నమ్మటానికి వీలులేదు.  దేహము నేను అనే తలంపు తప్పడు భావన, అందువలన దానిని పోగొట్టుకోవాలి, అది నిజం కాదు కాబట్టి అందులోనుండి విడుదల పొందాలి.  సద్వస్తువు వీటి అన్నింటికి అతీతంగా ఉంది, దానిలో ఐక్యంఅవ్వటానికి ప్రయత్నం చెయ్యి.  అది ఎలా ఉందో అలా ఉండటానికి ప్రయత్నం చెయ్యి.  దాని గురించి ఊహించవద్దు, ఊహిస్తే నీ మనస్సు వెళ్ళి అక్కడ కూర్చుంటుంది.  అది మనస్సుకు అందదు, మనస్సు నశిస్తే అది ఎరుకలోనికి వస్తుంది.  ఒక ప్రక్క మనం సాధన చేస్తున్నాము అనుకొంటున్నాము, ఇంకో ప్రక్క అహంభావనకు నీరుపోసి, దానిని పెంచి, దాని అస్థిత్వాన్ని కాపాడుకొంటున్నాము.  అది విడిచిపెట్టి వెళ్ళిపోతానన్నా వెళ్ళనివ్వటంలేదు ఎందుచేతనంటే అది లేకపోతే మనం ఉండవేమోనని మనకు భయం.  అహంభావన లేకుండా కూడా మనం ఉంటాము, ఉండగలము.  కాని అహంభావన లేకుండా, దేహం లేకుండా, లోకం లేకుండా మనం ఉండలేము అని అనుకొంటున్నాము, అలా ఉండలేము అని అనిపింపజేసేది కూడా అహంభావనే.  శరీరానికి గాయం తగిలితే సహించగలరుగాని అహంభావనకు గాయం తగిలితే సహించలేరు ఎందుచేతనంటే అదేమీరు అనుకొంటున్నారు.

నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో ఆనేనును విచారణ చేసి తొలగించుకొన్నావు అనుకో, ఏరకమైన దుఃఖం వచ్చినా అది నిన్ను చలింపజేయదు, వాడు యోగి, వాడు జ్ఞాని.  ఆ స్థితిని పొందటానికి ప్రయత్నం చేయి అని భగవంతుడు చెపుతున్నాడు.  డబ్బు సంపాదించేవాడు ఎంతకష్టపడి డబ్బును సంపాదిస్తాడో అంతకంటే ఎక్కువ కష్టపడితేగాని ఆస్థితి పొందలేవు.  డబ్బు కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది కాని నీవు కష్టపడి ఆస్థితిని పొందావు అనుకో, దానికి పోవటం అంటూ లేదు.  ఎప్పడూ ఉండే దానిని పొందటానికి ప్రయత్నం చెయ్యి, అదే నీ జీవిత గమ్యం.  హృదయంలో ఉన్న సత్యం గురించి మనకు తెలియటం లేదు, అది ఉందని జాడకూడా తెలియటం లేదు.  అది నీ హృదయంలో ఉంది అని పరమాత్మ చెపుతున్నాడు కదా అని పరమాత్మ చెప్పిన వాక్యం మీద ప్రమాణబుద్ధి నీకులేదు.  పరమాత్మ

మాటమీద నీకు నమ్మకం లేదు, విశ్వాసం లేదు. భగవంతుడు చెప్పిన మాటకంటే సత్యం ఏమి ఉంటుంది, మనం దానిని విశ్వసించాలి అనే బుద్ధి నీకు కలగటం లేదు దానికి నీ అంతఃకరణంలో ఉన్న దోషం కారణం, అది నిన్ను నమ్మనివ్వదు. నీ హృదయంలో నిజమైన నేను ఉంది అని భగవంతుడు చెపుతున్నాడు. అది నీకు తెలియటం లేదు. అది నీ కళ్లకు కనబడటం లేదు కాబట్టి అది లేదు అంటున్నావు. భగవంతుడు చెప్పిన మాట ప్రమాణమా? నీ మాంసపు నేత్రాలు ప్రమాణమా? నీ హృదయంలో ఒక సత్యం ఉంది. అది హృదయాకాశంలో నేను, నేను అని నాట్యం చేస్తోంది. అది నీకు తెలియకుండా అడ్డు వచ్చేది ఎవరోకాదు నీ లోపల ఉన్న నకిలీ నేను అడ్డువస్తోంది. దానిని తొలగించుకోవటం మాట అటు ఉంచు, హృదయంలో ఉన్న సత్యం నీకు తెలియకుండా నకిలీ నేను అడ్డువస్తోంది అని గ్రహించటానికి ఎన్ని జన్మలు పడుతుందో? నీ హృదయంలో ఉన్న సత్యాన్ని గ్రహించటానికి తెలివి ఒక్కటే సరిపోదు, ఏకాగ్రత, సూక్ష్మబుద్ధితోపాటు పరమపవిత్రత అవసరం. సత్కర్మ చేయడం వలన, మనస్సు బంగారం అవ్వటం వలన, గురువు అనుగ్రహం వలన ఈ నకిలీ నేను ఊడిపోవాలి గాని నీవు బలవంతంగా లాక్కొనేదికాదు. ఈశ్వరానుగ్రహం రావాలి కాని ఆ అనుగ్రహ ప్రవాహంలో పెద్ద పెద్ద దుంగలలాంటి దోషాలు ఉన్నాకూడా గడ్డిపరక కొట్టుకొని పోయినట్లు కొట్టుకొనిపోతాయి. మనం ఈశ్వరుని దయకు పాత్రులవ్వాలి. మన ప్రయత్నంతోపాటు ఆయన దయ ఉంటే మన అంతఃకరణంలో ఉన్న దోషములు అన్నీ కాలిబూడిద అవుతాయి. అప్పుడు లోపల ఉన్న వెలుగు మనకు తెలుస్తుంది.

శరీరం వస్తే సంసారం వస్తుంది. సంసారం వస్తే గొడవలు వస్తాయి, బాధలు వస్తాయి. మన హృదయంలో ఉన్న జ్ఞానగంగ మన చేతికి అందేవరకు, ఇప్పుడు దేహము నేనుగా నీకు ఎలా వ్యక్తమవుతోందో అలాగ నీ హృదయంలో ఉన్న చావులేని వస్తువు నీకు నేనుగా వ్యక్తమయ్యేవరకు సంసారం తీసుకొని వచ్చే బాధలనుండి, ప్రకృతి తీసుకొని వచ్చే బాధలనుండి, లోకంలో వచ్చే గొడవలనుండి మనం విడుదల పొందలేము. ఎంతోకొంత వాటి ప్రభావం మనమీద ఉంటుంది. మన హృదయంలో ఉన్న బంగారం మనకు తెలిసేవరకు బాహ్య సంఘటనలకు ఎంతోకొంత చలించకుండా మనం ఉండలేము. ఒకవేళ చలించకుండా ఉన్నట్లు పైకి నటించినా దాని తాలుక బాధ ఎంతోకొంత మనస్సులో ఉండకుండా ఉండదు. మన హృదయంలో ఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి వచ్చేవరకు శరీరాలను మోయవలసిందే. శరీరం వచ్చింది అంటే సంసారం వస్తుంది. సంసారం వచ్చింది అంటే బాధ వస్తుంది. ఇలా ఏ జన్మకు ఆ జన్మ చలించిపోతూ ఉంటాము ఎప్పటి వరకు అంటే హృదయంలో ఉన్న జ్ఞానగంగలో మునిగే వరకు ఈ తిప్పలు తప్పవు. పైకి శాంతిగా కనిపించినా





లోపల అగ్ని హోత్రం పెట్టుకొని కాలిపోయే మనుషులు అనేకమంది ఉన్నారు. మనం ఎవరో మనం తెలుసుకొనే వరకు ఏదోరకమైన చింత, వేదన, దారిద్ర్యం జీవుడిని ప్రతీజన్మలోను వెంటాడుతూనే ఉంటుంది. మీ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అవి నిజం అని అనుకోవద్దు, కాల ప్రవాహంలో ఇవి అన్నీ కొట్టుకొనిపోతాయి. మన హృదయంలో ఉన్న బంగారం మనకు దొరికే వరకు మనకు తిప్పలు తప్పవు.

జీవుడు అనేవాడు లేనేలేడు నీకు ఉన్న అజ్ఞానం వలన, శవబుద్ధి వలన ఈశ్వరుడే జీవుడిక్రింద కనిపిస్తున్నాడు. అజ్ఞానం పగిలిపోతే జీవుడులేడు, ఉన్నవాడు ఈశ్వరుడే అనే అనుభవం నీకు కలుగుతుంది. భగవంతుడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం నీకు ఉంటే, భగవంతుడి పట్ల నీ భక్తి నిజమైతే నీవు కుక్కమాంసం తినటానికి అలవాటు పడ్డాకూడా సమాజం నిన్ను గౌరవిస్తుంది, భక్తిలో ఉన్న విశేషం అటువంటిది, భక్తియొక్క ఔన్నత్యం అటువంటిది అని వ్యాసుడు చెప్పాడు.

## రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-05-2002, నార్నిమెరక)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అహంభావరహితస్థితిని పొందటంకోసం మనం ఈ భూమి మీదకు వచ్చాము. అహంభావరహితస్థితిని సంపాదించినప్పుడు మోక్షం దానంతట అదే కలుగుతుంది. అహంభావరహితస్థితిని పొందటానికే నేను ఎవడను అనే విచారణ. మన మనస్సును చైతన్యంనందు, ఇష్టదేవతయందు నిలబెట్టి ఉంచాలి. అలాకాకుండా నిరంతరం విషయాలను చింతిస్తూ ఉంటే మరణాన్ని కొనుక్కొన్నట్లే. దైవచింతన వలన ప్రకృతినుండి విడుదల పొందుతాము, విషయచింతన వలన జననమరణప్రవాహంలో బంధించబడతాము. కేవలము తెలివివలనగాని, యుక్తివలనగాని, చమత్కారములవలనగాని, పాండిత్యం వలనగాని, ఐశ్వర్యంవలనగాని మనకు ఆత్మశాంతి దొరకదు. ఆత్మవిశ్వాసం ఎంతమంచిదో, ఆత్మహింస అంత చెడ్డది. మనుషులలో చాలామంది కారణంలేకుండా వారినివారు హింసపెట్టుకొంటూ ఉంటారు. దానిని ఆత్మహింస అంటారు. ఆత్మహింసవలన మానసిక అనారోగ్యం వచ్చేస్తుంది. ఆత్మవిశ్వాసం వలన మనకు ఆత్మబలం పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం ఆత్మజ్ఞానానికి పునాది వంటిది. మనం ఎంతోకొంత ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే, ధర్మాన్ని ఆచరించే వాడికి మోక్ష మార్గం కనిపిస్తుంది. మోక్షం కావాలని మనం కోరుకోనక్కరలేదు, మనకు అర్హత ఉంటే,

మనస్సుకు పక్వత వస్తే అదే వచ్చేస్తుంది. తెలివికంటే ధర్మఆచరణ గొప్పది. ధర్మఆచరణ ఆత్మజ్ఞానాన్ని తీసుకొని వస్తుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలనుకొనేవాడు దైనందిన జీవితంలో ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండాలి.

రంతిదేవుడు మహావిష్ణువును అడుగుతాడు నాకు సిద్ధులు అక్కరలేదు, మహిమలు అక్కరలేదు, మోక్షం అక్కరలేదు నాకు కావలసింది ఏమిటి అంటే అందరి హృదయాలలో నేను ఉండాలి, అందరి హృదయాలలో నేను ఉండటమే కాదు, ఎవరికి ఏ రకమైన దుఃఖం వచ్చినా ఆ దుఃఖం వారు భరించకుండా నేనే భరించాలి అటువంటి వరాన్ని ఇమ్మని రంతిదేవుడు మహావిష్ణువును ప్రార్థిస్తాడు. వైరాగ్యం లేనివాడికి సుఖంలేదు, శాంతిలేదు, జ్ఞానం లేదు. మా మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతోంది అని చాలామంది అంటారు దానికి 90 కారణాలు లేవు, వైరాగ్యం లేకపోవటం ఒక్కటే కారణం. వైరాగ్యం ఉంటే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళదు. వైరాగ్యం ఉన్నవాడు వాడికి సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా, లాభం వచ్చినా, నష్టం వచ్చినా ఒకేలాగ ఉంటాడు, వాడికి బేధం తెలియదు. ఈ కళ్ళకు కనిపించేది అంతామాయ అని వైరాగ్యం ఉన్నవాడికి తెలుస్తూ ఉంటుంది. వైరాగ్యం లేనివాడు సుఖి కాలేడు. పొందవలసింది బయట ఏమీలేదు, హృదయంలోనే ఉంది. నీకు సరియైన టీచర్ లేనప్పుడు ఇది తెలుసుకోవటానికి నీకు కొన్నివేల జన్మలు పట్టవచ్చు. మనం ఏదైనా మంచిపని చేయాలనుకొన్నప్పుడు ఆలస్యంచేయకూడదు, వెంటనే చేయాలి. శరీరం చనిపోయిన తరువాత ఈ శరీరాన్ని ఇక్కడ స్మశానంలో కాల్చేస్తారు. మనం ఒంటరిగా మనదారిని వెళ్ళిపోతాము, జత ఎవరూ ఉండరు, ఒక్కరిమే ప్రయాణం చేయాలి. మనం చేసే పొరపాటు ఏమిటి అంటే శరీరం చనిపోయిన తరువాత మనం ఒక్కరిమే వెళ్ళేటప్పుడు మనకూడా తీసుకొని వెళ్ళే సంపాదన మనం ఏమీ సంపాదించటం లేదు, మనం అందరం పెద్దసున్నలం. శరీరంతో వదిలివెళ్ళే సంపాదన సంపాదించుకొంటున్నాముగాని మరణానంతరం మనకూడా వచ్చే సంపాదన ఎవరూ సంపాదించుకోవటం లేదు. ఎటువంటి పరిస్థితులలోను మనస్సును కంగారుపెట్టుకోవద్దు. మనస్సును కంగారుపెట్టుకొంటున్నారు అంటే మీకు వైరాగ్యం లేదు అని అర్థం. మనస్సును కంగారు పెట్టుకోవటం వలన జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది, ఆలోచన తగ్గిపోతుంది. మనస్సు కంగారుగా ఉన్నప్పుడు మనం తప్పుడు నిర్ణయాలు తీసుకొంటాము, దానివలన మనమే నష్టపోతాము. నా మనస్సును కంగారుపెట్టుకోవటం వలన నేనే నష్టపోతున్నాను, నేను నష్టపోయేపని నేను ఎందుకు చేయాలి. అందువలన మనస్సును కంగారు పెట్టుకోవద్దు.

05-06-2002



మనస్సు అంటే తలంపుల సమూహము. నీకు వచ్చే తలంపులను నిరోధించవద్దు, నీకు వచ్చే తలంపులను చూస్తూ ఉండు. తలంపుకు రియాక్టు అవ్వవద్దు, ప్రతీదానికి రియాక్టు అయితే చీకటిలో పడిపోతాము. ఎవరినైనా ద్వేషించాలి అనే తలంపు వచ్చింది అనుకో వస్తేరానియ్యి కాని వాడిని ద్వేషించకు. ఆ తలంపు అలా వస్తుంది, పోతుంది. నీకు వచ్చే తలంపులను ఆచరణలో పెట్టకుండా వాటిని అలాచూస్తూ ఉంటే కొంతకాలానికి నీకు ఉపయోగంలేని తలంపులు అన్నీపోతాయి, బాగుపడే తలంపులు వస్తాయి. నరకానికి వెళ్ళే అలవాట్లు నీలో ఉంటే అవి పోవాలి, ఆత్మజ్ఞానానికి సహకరించే అలవాట్లు నీకు రావాలి. జపంవలన, ధ్యానంవలన, ఉపాసనవలన ఇవి వస్తాయి. శరీరం పుట్టటం, చనిపోవటం గొడవ నీకు వద్దు. వీటితో సంబంధం లేకుండా నీ హృదయంలో పరమేశ్వరుడు ఉన్నాడు. వాడిని పొందటానికి సర్వవిధములుగా ప్రయత్నం చెయ్యి. గతి అల్లా శరణాగతే. శరణాగతి వలన మనస్సు చల్లబడుతుంది. ఈశ్వరుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం ఉన్నవాడు భయరహితుడు అవుతాడు. ఇతరులు ఎవరైనా మనలను ఉద్రేకపరచటానికి ప్రయత్నం చేసినా మనం ఉద్రేకరహితంగా ఉండాలి. మీరు నన్ను చూసి అసూయ పడుతున్నారు అనుకోండి అప్పడు కూడా మీపట్ల నేను అసూయరహితంగా ఉండాలి. అసూయపడేవారి మధ్యన, ఉద్రేకపడేవారి మధ్యన అసూయరహితంగా, ఉద్రేకరహితంగా ఉండగలిగితే నాకు భక్తి ఉన్నట్లు గుర్తు, నాకు ఆధ్యాత్మికంగా ఎంతోకొంత బలం ఉన్నట్లు గుర్తు. మన అందరికి తిరిగిజన్మలు వస్తాయి, ఇందులో సందేహం లేదు. ఎందుచేతనంటే మనకు జీవితంలో తృప్తి అనేది అసలులేదు. మనకు ఉన్న అసంతృప్తి మరల మనలను ఈ భూమి మీదకు తీసుకొనివస్తుంది. మనకు ఉన్న తెలివితేటలవలన లాభనష్టములు రావు, మన దేహప్రారబ్ధమునుబట్టి లాభనష్టములు వస్తాయి. నీ మనస్సును ఎప్పడూ సమానంగా ఉంచుకో. మనకు చెడుఅలవాట్లు ఉన్నాయి అనుకోండి. మాకు చెడు అలవాట్లు ఉన్నాయి అనుకోవటంకాదు, వాటిలోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి.

ఈ జన్మ ఏమీబాగాలేదు, నార్నిమెరకలో పుట్టాము ఏమిటి ఇక్కడ ఏమీ బాగాలేదు వచ్చేజన్మ బాగుంటుంది అని చూస్తాము. ఇది పెద్ద వెర్రితనం. ఈ జన్మలో మనకు సుఖంలేదు, శాంతిలేదు, అందరూ మనలను దుఃఖపెట్టేవారేగాని, మనలను సుఖపెట్టేవారు ఎవరూలేరు, ఈ జన్మ ఏమీ బాగాలేదు, రాబోయే జన్మలో సుఖం వస్తుంది అనుకొంటాము. ఇది మనలో ఉన్న అమాయకత్వానికి గుర్తు. రాబోయే జన్మలో కాదుకదా నీవు వెయ్యి జన్మలు ఎత్తినా నీకు సుఖంరాదు. ఎందుచేతనంటే సుఖం బయటలేదు. సుఖం నీలోపలే ఉంది. సుఖం

కావాలంటే నీవు లోపలకు వెళ్ళవలసిందే. నీవు నార్నిమెరకలో 10 రూపాయలు సంపాదించి పాలకొల్లు సినిమాకు వెళ్ళావు అనుకో, ఆ పది రూపాయలు ఖర్చు అయ్యేవరకు సినిమాహాలులో టీ త్రాగుతావు, సిగరెట్ కాలుస్తావు. ఆ డబ్బు ఖర్చు అయ్యాక తిరిగి నార్నిమెరక రావలసిందే. సినిమా హాలులో ఖర్చు తప్ప అక్కడ నీవు సంపాదించేది ఏమీలేదు. అలాగే మరణానంతరం మనం మంచిలోకాలకు వెళ్ళినా, చెడ్డలోకాలకు వెళ్ళినా మనం చేసిన పాపం, పుణ్యం అక్కడ అనుభవిస్తాము అంతేగాని అక్కడ కొత్తగా సంపాదించేది ఏమీలేదు. నీవు సాధనచేయటానికి తిరిగి ఈ భూమిమీదకు రావలసిందే, ఇంకోగత్యంతరం లేదు. ఇప్పుడు పుణ్యం చేస్తే మంచి జన్మలు వస్తాయి, అప్పుడు సుఖపడవచ్చు అనుకొంటాము. ఇవిఅన్నీ పిచ్చిపిచ్చి ఆలోచనలు. ఇలా ఆలోచిస్తూ కొన్నివేల జన్మలు పాడుచేసుకొంటున్నావు. లోపలఉన్నవస్తువును పట్టుకోకుండా, నీవు లోపలకు వెళ్ళకుండా నీ మనస్సే నిన్ను మాయ చేస్తుంది. ఎవరో మాయచేయటం కాదు, మన మనస్సే మనలను మాయ చేస్తోంది అనే గుర్తింపు మనకు రావటంలేదు. పుణ్య క్షేత్రాలకు వెళితే సుఖం వస్తుంది, కాశీ వెళితే పుణ్యం వస్తుంది, గంగానదిలో స్నానం చేస్తే పవిత్రత వస్తుంది అని ఇలా అనుకొంటాము. అంత మాత్రంచేతనే పవిత్రత వస్తే ఇంక సాధన ఎందుకు? మన మనస్సు ఇలా ఏదో ఒకటి కల్పిస్తుంది. మనం పొందవలసింది మన హృదయంలోనే ఉంది. ఆనందం అనేది బయటలేదు. ఆత్మకు మరోపేరు ఆనందం, ఆత్మకు మరోపేరు శాంతి, ఆత్మకు మరోపేరు జ్ఞానం. నీవు అక్కడకు వెళ్ళకుండా నీ మనస్సు రకరకాలుగా మాయచేస్తుంది. వారు బాగున్నారు, వీరు శాంతిగా ఉన్నారు, అక్కడికి వెళితే శాంతి అని చెపుతుంది. వారి మనస్సులో ఎన్ని ముళ్ళకంపలు ఉన్నాయో నీకు తెలియదు. ఉన్నదంతా నీ హృదయంలోనే ఉంది. అక్కడకు వెళ్ళే వరకు నీకు సుఖం లేదు, శాంతి లేదు, అమృతానుభవం పొందలేవు.

రాగద్వేషములనుండి జీవుడు విడుదలపొందటం చాలా కష్టం, దానికి ఎంతో సాధన ఉండాలి, ఎంతో పోరాటం ఉండాలి. రాగద్వేషములనుండి విడుదలపొందాలంటే నీవు బ్రతికుండగానే చనిపోవాలి. కొన్ని సంవత్సరాల తరువాత ఎలాగూ చనిపోతావుకదా ఇప్పడే చనిపోయానుఅనుకొంటేసరి. గాఢనిద్రలో నీకు ఏ గొడవలేదు, అది నీ సహజస్థితి. దానిని జాగ్రదవస్థలోనికి తెచ్చుకోవాలి. సహజస్థితిని పొందేవరకు నీకు ఏ తలంపువచ్చినా ఈ తలంపు ఎవరికి వస్తోంది? అని విచారణ విడిచిపెట్టకూడదు. మన తెలివి తేటలు ఎంత పెరిగినాయి అంటే ఒక్క అంగుళం కూడా మనం లోపలకు వెళ్ళలేకపోతున్నాము. మన కూతురు చెప్పినట్లు అల్లుడు వినాలి, కాని కోడలు చెప్పినట్లు మన కొడుకు వినకూడదు అంతగా ఉంది మన తెలివి, మనం ఇంత బుద్ధిమంతులము. పుస్తకాలు చదివితే ఆత్మజ్ఞానం రాదు, హృదయాన్ని చదివేవాడికి ఆత్మసుఖం అందుతుంది. హృదయాన్ని చదివేవాడు ఈ జన్మలో కాకపోయినా, మరోజన్మలో అయినా నిజమైనసుఖి అవుతాడు. హృదయాన్ని చదవకుండా ఎవడూ జ్ఞాని కాలేడు. మీరు పుస్తకాలు చదవటానికి అలవాటు పడ్డారుకాని హృదయాన్ని చదవటం నేర్చుకోండి. మనం నిస్సంకల్పస్థితిని పొందాలి. సంకల్పరాహిత్యస్థితిని పొందినప్పడు, హృదయంలో ఉన్న ఆనందమును నీవు అనుభవిస్తున్నప్పడు సృష్టికర్త వచ్చి నీకు కనిపించినా నీకు చూడాలని అనిపించదు, ఆ వైభవం అట్టిది. వచ్చే జన్మ మనకు గొప్ప జన్మ వచ్చేస్తుంది, వచ్చే జన్మలో శాంతి వచ్చేస్తుంది అని కనిపెట్టుకొని ఉండకండి. మీకోసం మట్టిరోడ్డులు, ముళ్ళకంపలు కనిపెట్టుకొని ఉన్నాయి. ఇలా ఏదో ఊహించుకోవద్దు. ఏదో చేయటం వలన మీకు సంతోషం వచ్చింది అనుకోండి అది ఎంతకాలం ఉంటుంది, కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది.

ఇప్పడు నీవు అసహజస్థితిలో ఉన్నావు. అందువలన దుఃఖంలో ఉన్నావు. వచ్చే జన్మలో ఏదో వచ్చేస్తుంది అనుకోవద్దు. సహజస్థితి కలిగేవరకూ నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. శాంతిని, జ్ఞానాన్ని ఏదోకాలానికి, ఏదో ప్రాంతానికి పరిమితం చేయవద్దు. కాశీలో వచ్చేస్తుంది, రామేశ్వరంలో వచ్చేస్తుంది, దేహం చనిపోయిన తరువాత ఎక్కడికో వెళ్ళిపోతాము అక్కడ శాంతి వచ్చేస్తుంది అనుకోవటం నీ అజ్ఞానానికి గుర్తు. నీకు ఏ దేహం వచ్చినా నేను, నాది ఉంటుంది. అదినాది, ఇదినాది అంటావు. నీ శరీరమే నీదికానప్పడు అవి నీవి ఎలా అవుతాయి. నీ శరీరమే నీదికాదు అన్న సంగతి నీకు తెలియటం లేదు. నేను, నాది అనే తలంపులు నిశ్శేషంగా నశించేవరకూ నీకు సహజస్థితిరాదు. శేషం మిగిలితే పునర్జన్మ వచ్చేస్తుంది. స్వార్ధపరుడు తన స్వార్ధం కోసం ఎలా పనిచేస్తాడో అలాగ సాధకుడు దేహము నేను అనే తలంపును పోగొట్టుకోవటానికి నిర్విరామంగా, నిరంతరం కృషిచేయాలి. బయటకారణాలవలన ఏదైనా సుఖం వచ్చినట్లు నీకు అనిపించినా అది బయట నుండి రావటంలేదు. సుఖం బయట ఉంటేకదా రావటానికి. మీకు ఏదైనా కోరిక నెరవేరింది అనుకోండి అప్పడు నీకు సుఖం వస్తుంది. అప్పడుకూడా ఆకోరిక నెరవేరటంవలన ఆ సుఖం నీకు రావటంలేదు. కోరిక నెరవేరినప్పడు మనస్సు లోపలకు వెళుతుంది, అప్పడు హృదయంలో ఉన్న సుఖాన్ని పీల్చుకొంటుంది. అంతేగాని నీ కోరికలో సుఖంలేదు. మీరు పాయసం త్రాగారు అనుకోండి, ఆనందంగా ఉన్నట్లు ఉంటుంది. పాయసం త్రాగినప్పడు నీ మనస్సు లోపలకు వెళ్ళటం వలన లోపలఉన్న ఆనందాన్ని అది జుర్రుకొంటుంది. అప్పడు

కూడా నీవు అనుభవించేది హృదయంలో ఉన్న ఆనందమే కాని పాయసంలో ఆనందంలేదు. బయట ఏమీలేదు. బయట ఏదోఉంది, భవిష్యత్‌లో ఏదో వచ్చేస్తుంది అని కనిపెట్టుకొని ఉండవద్దు. ఈ భూమి మీద ఉండగా సాధనచేసి పొందవలసింది పొందు. భగవంతుడు ఇచ్చిన అవకాశములను సమాజం కోసం ఉపయోగించు. ఎందుచేతనంటే సమాజరూపంలో ఉన్నవాడు కూడా ఈశ్వరుడే. నీ చైతన్య స్థాయిని పెంచుకోవటానికి సమాజమును ఉపయోగించుకో. చిన్నచిన్న విషయాలకు ఉద్రేకపడుతున్నావు అనుకో లోపలకుదిగేశక్తి తగ్గిపోతుంది.

ఆత్మ ఎప్పుడూ ఉంది. అది అన్ని కాలాలలోను, అన్ని అవస్థలలోను, అన్ని ప్రాంతాలలోను ఉంది. లోకం ఉన్నప్పుడు ఉంది, లోకం లేనప్పుడు అది ఉంది. దానిని నీవు ప్రత్యేకంగా కనిపెట్టనక్కరలేదు. అది అనుభవంలోనికి రాకుండా ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకో. ఏదీ లేనప్పుడు, జీవకోటిలేనప్పుడు, పంచభూతములు లేనప్పుడు ఏదైతే ఉందో దానినే ఆదిస్థితి అంటారు. అది నీవై ఉన్నావు. ఏదో శాస్త్రాలు చదవటం కాదు, నీ హృదయంలో

నాన్నగారు మాకుచాలు
మీపాద కమలసేవ!
నాన్నగారు మాకు చాలు
మీ పలుకు తేనె ధార! ॥నాన్నగారు॥

అమ్మ ఒడిని మేముంటే
అన్న చింతలేల మాకు!
వడ్డించిన విస్తరుంటె
వంటచేయు యత్నమేల? ॥నాన్నగారు॥

అసలు నేను, మిథ్యానేను
అహంకారం, మొదటి తలంపు
ఆ తర్కము లేల మాకు,
ఆ చిక్కులు వలదు మాకు! ॥నాన్నగారు॥

జనన మరణ చక్రమ్ముల
గణాంకాలు మాకు వద్దు!
నరక, నాక, పుణ్య పాప
పరిగణనలు మాకు వద్దు! ॥నాన్నగారు॥

ఎన్ని జన్మ లైతే నేమి
అన్నిట మిము మరువకుంటె!
ఎన్ని యుగాలైతే నేమి
నాన్నగారు మీరుంటే! ॥నాన్నగారు॥ - డా॥ ఆర్.ఎ. నాయక్

05-06-2002



ఉన్న వస్తువు అనుభవంలోనికి రాకుండా నీకు ఏది అడ్డువస్తోందో దానిని తెలుసుకొని, దానిని తొలగించుకొనే చదువు చదువుకో. ఇతరుల గొడవవద్దు. నీలోపం ఏమిటో నీవు చూసుకో. నిప్పురవ్వను అజాగ్రత్తగా వదిలేస్తే ఇల్లు అంటుకొనే ప్రమాదం ఉంది. అలాగే నీ బుద్ధిలో చిన్న దోషం ఉన్నా అది నిన్ను పతనం చేసేస్తుంది. నీ బుద్ధిలో ఉన్న చిన్న దోషాన్ని నీవు పట్టించుకోవు అనుకో ఆధ్యాత్మికంగా పతనమవ్వటానికి అదే కారణం అవుతుంది. నీ అజాగ్రత్తవలన, అశ్రద్ధ వలన, అవినయం వలన నీవు పాడైపోతున్నావు. వినయంలేకుండా శాంతి రాదు, జ్ఞానం రాదు. వినయంలేనివాడితో సహవాసం చేస్తే మనకు కూడా అవినయం వచ్చేస్తుంది. అక్కడ సుఖం ఉంది, ఇక్కడ సుఖం ఉంది అని నీ మనస్సు బయటకు పరుగెడుతోంది. ఎక్కడైతే సుఖం ఉంది అని నీ మనస్సు చెపుతోందో అక్కడ సుఖం లేదు. సుఖం నీ హృదయంలోనే ఉంది. నేను అనే తలంపు ఎక్కడైతే పుట్టివస్తోందో అక్కడే సుఖం ఉంది. నీవు అక్కడకు వెళ్ళి అందులో మునగవలసిందే. నీవు అనుకొన్నచోట సుఖంలేదు, అందుచేత సుఖం ఎక్కడయితే ఉందో అక్కడకు నీవు వెళ్ళాలి, దానికి సత్పురుషుల సహవాసం అవసరం. మూలతలంపు మూలంలోనే భగవంతుడు ఉన్నాడు, అక్కడే సుఖం ఉంది, శాంతి ఉంది, ఆనందం ఉంది. అక్కడకు వెళ్ళటానికి నీకు వైరాగ్యం ఉండాలి, పూర్వపుణ్యం ఉండాలి, సాధనాబలం ఉండాలి, సత్కర్మ చేసి ఉండాలి వీటితోపాటు ఈశ్వరునిదయ ఉండాలి. హృదయంలోనికి వెళ్ళి అక్కడ జ్ఞానగంగలో మునిగే వరకు నిన్ను దుఃఖం వెంటాడుతుంది, దుఃఖరహితస్థితిని నీవు పొందలేవు. కోటిజన్మలలోకూడా నీవు అక్కడకు వెళ్ళలేవు అనుకో కోటిజన్మలు కూడా నిన్ను దుఃఖం వెంటాడుతుంది. ఎక్కడా ఏమీలేదు, ఉన్నది అంతా నీ హృదయంలోనే ఉంది. ఎక్కడో ఉంది, ఎక్కడో ఉంది అనుకొనేది నీ హృదయంలోనే ఉంది. ఎప్పుడో వస్తుంది, ఎప్పుడో వస్తుంది అనుకొనేది ఇప్పుడే వస్తుంది నీవు విచారణ చేస్తే. మీరు గంట సేపు పుస్తకం చదివితే రెండు గంటలు హృదయాన్ని చదవండి. హృదయాన్ని చదవటం నేర్చుకోండి. నేర్చుకొంటే ఏదైనా వస్తుంది, శ్రద్ధ అవసరం. హృదయానికి సంబంధించిన చదువు లేకపోతే బాహ్య చదువుల వలన నీకు ఏమీ ఉపయోగం లేదు. అవి కేవలం నీ పొట్టకే పరిమితం.

# రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-04-2002, రావ్రులపాలెం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భౌతికంగాకాని, ఆధ్యాత్మికంగాకాని అభివృద్ధిలోనికి రావటానికి ప్రతీవ్యక్తికి ఓర్పు, పట్టుదల, నిగ్రహం ఇవి మూడూ అవసరం. ఓర్పులేనివాడికి ప్రతిస్పందన ఎక్కువ ఉంటుంది. ఓర్పులేనివాడు నిర్మాణాత్మకమైన పనులుచేయలేడు. ఓర్పులేనివాడు చేసేపనులు వాడికుటుంబానికిగాని, సమాజానికిగాని, దేశానికిగాని ఉపయోగపడవు. ఓర్పుఉన్నవాడు, నిగ్రహం ఉన్నవాడు అందరికి ఉపయోగపడే పనులు చేస్తాడు. సర్వసాధారణంగా కత్తికి ఒక ప్రక్కనే పదును ఉంటుంది. ద్వేషంఅనే కత్తికి మాత్రం రెండువైపుల పదును ఉంటుంది. ఒకప్రక్క పదును ద్వేషంఅయితే, రెండోప్రక్క పదును కక్ష. ద్వేషం ఉన్నచోట కక్షకూడా ఉంటుంది. ఎవరిమీద అయితే ద్వేషం ఉందో వారిని హింసించాలనే బుద్ధి మనకు తెలియకుండా వచ్చేస్తుంది. పని మిమ్మల్ని విడిచిపెట్టాలిగాని మీరు పనిని విడిచిపెట్టవద్దు. పని విడిచిపెడితే సోమరితనం వస్తుందిగాని జ్ఞానంరాదు. పనివిడిచిపెట్టటంవలన ఇతరులను పోషించటంమాట అటుఉంచండి, చివరకు మీ శరీరమే మీకు బరువు అవుతుంది. స్వార్థం లేకుండా పనిచేయటం మనం నేర్చుకోవాలి. సార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే అదిసమాజానికి ఉపయోగపడుతుంది, మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. స్వార్థంలేకుండా జీవిస్తూఉంటే దేహంగా, మనస్సుగా, అహంభావనగా జీవించటం తగ్గిపోతుంది. మానవుడు తనలో ఉన్న స్వార్థం కొంచెం తగ్గించుకొంటే ఎన్నో మంచి పనులు చేయవచ్చు. మంచిపనులు చేయగాచేయగా మంచిగా ఉండటం అలవాటు అవుతుంది. హృదయగుహలో ప్రవేశించటానికి మంచితనం మనకు సహకరిస్తుంది.

కర్మను యోగంగాచేయాలి అంటే కర్మఫలం ఆశించకుండాచెయ్యాలి. ఆశించకుండా వచ్చినది మనలను బంధించదు, కోరి తెచ్చుకొన్నది మనలను బంధిస్తుంది, ఆబంధమే పునర్జన్మకు కారణమవుతుంది. నేను మీకు ఎవరికైనా అపకారంచేసాను అనుకోండి తప్పనిసరిగా రాబోయే జన్మలో మీచేత అపకారం పొందుతాను. ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం సంపాదించు. ఇంద్రియనిగ్రహంవలన, మనోనిగ్రహంవలన చిత్తశుద్ధి కలుగుతుంది,





చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే హృదయంలో ప్రవేశించగలము. మనంరోజూ నిద్రపోయేముందు ఈ రోజుఎలా జీవించాము మనపొట్టకోసమే జీవిస్తున్నామా, ఇతరులకు ఉపయోగపడే పనులు ఏమైనా చేస్తున్నామా అని ఏరోజుకారోజు చూసుకోవాలి. మనంఏమైనా సాధనచేస్తున్నామా? మనలను మనం మర్చిపోయి ఇతరులకు ఏమైనా ఉపకారం చేస్తున్నామా అని చూసుకొంటే మనకు మార్కులుసున్నా. ఇంకమనకు ఆత్మజ్ఞానం ఏమి కలుగుతుంది. మనం ఏమాట మాట్లాడినా, ఏ పనిచేసినా, మనకు ఏ తలంపువచ్చినా మనం పవిత్రులవ్వటానికి అది సహకరించాలి. మనలోపల ఉన్న సద్వస్తువు పరమపవిత్రమైనది, దానికి పరిమితులు లేవు, అది స్వేచ్ఛగా ఉంటుంది, ఏకంగా ఉంటుంది, చావుఎలా ఉంటుందో దానికి తెలియదు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఈ రోజున మనం నాలుగు మంచిమాటలు వింటున్నాము అంటే మనం పూర్వజన్మలో చేసినసత్కర్మ మనలను ఇక్కడకు తీసుకొనివచ్చింది, మనం సత్కర్మ చేయకపోతే మనం మొఖం ఇటు తిరగదు. మీకు ఏదైనా దు:ఖం వస్తోంది అనుకోండి. ఈ దు:ఖం ఎవరికివస్తోంది? ఈ దు:ఖపడేవాడు ఎవడు? అని మీరు విచారణ చేసుకొంటే ఆ నేను పోతాడు. ఆ నేనుపోతే మీరు పోరు, మీరు ఎవరో మీకు తెలుస్తుంది. అప్పుడు ఆనందసాగరంలో, శాంతిసాగరంలో ఊగిసలాడుతారు. నీలోపల సద్వస్తువు ఉంది, నీకు తెలిసినా, తెలియకపోయినా అది నీలోపలే ఉంది. నీ భ్రాంతి వలన, నీబుద్ధిలో ఉన్నదోషంవలన అది నీకు తెలియటంలేదు. నీ భ్రాంతిలోనుండి బయటకురా, దేహభిమానంలో నుండి బయటకు రా అప్పుడు అది నీకు గోచరమవుతుంది.

**ఆత్మ విశ్వాసము మంచిది, కాని ఆత్మహింస మంచిదికాదు**

**- సద్గురు శ్రీ నాన్నగారు**

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 6 నుండి 18-6-02 వరకు | | హైదరాబాదు క్యాంపు |
| 10-6-2002 | సోమవారం | సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటి హాలు, మధురానగర్ |
| 16-6-2002 | ఆదివారం | రమణ కేంద్రం, హైదరాబాదు నల్లకుంట శివం టెంపుల్ దగ్గర |
| 25/26-6-2002 | | చైతన్యతపోవన్ ఆశ్రమం, విజయవాడ-గుంటూరు హైవే మధ్యాహ్నం 4 నుండి 6 గంటల వరకు |
| 04-07-2002 | | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

### సద్గురు శ్రీనాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయం

(ఆంధ్రభూమి సోమవారం 3 జూన్, 2002)



పోడూరు మండలంలో సద్గురు శ్రీనాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు పేద ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆచంట ఎమ్మెల్యే మోచర్ల జోహార్ పేర్కొన్నారు. మండలంలోని జిన్నూరు పంచాయితీ కార్యాలయం వద్ద ఆదివారం 56 మంది వికలాంగులు, వితంతు వులు, పేద విద్యార్థులకు ఛారిటబుల్ ట్రస్టు మంజూరు చేసిన ఉపకార వేతనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ట్రస్టు మరింత అభివృద్ధి చెంది, పేద ప్రజలను మరింతగా ఆదుకోవాలన్నారు. జిన్నూరు సద్గురు శ్రీ నాన్నగారు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా కుల, మత, ప్రాంతీయ భేదం లేకుండా వందలాదిమంది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సాయం అందిస్తున్నామన్నారు. సర్పంచ్ కలిదిండి విజయలక్ష్మి మండల పరిషత్ అధ్యక్షురాలు గెద్దాడ పద్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సూక్తులు

ప్రేమలేని జీవితము దేవుడులేని గుడివంటిది

- శ్రీ నాన్నగారు

కోపమనే అగ్నిని వివేకమనే నీటితో ఆర్పమన్నారు

- వాల్మీకి

దయగల హృదయమే భగవన్నిలయము

-మళయాళస్వామి

హృదయశుద్ధిగలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు

- బైబిల్

ఏ ప్రాణిని ద్వేషింపవలదు. మైత్రి, కరుణ కలిగిఉండవలెను

- గీత

ఆనందము నీలోనే ఉన్నది, బయట వస్తువులలో లేదు

- శ్రీ రమణ మహర్షి

దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా,
సొంతలాభము కొంతమానుకొని, పొరుగువానికి తోడుపడవోయి

- గురజాడ

చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు.

- మహాత్మగాంధీ

విజయమునకు వినయము పునాది

- శ్రీ నాన్నగారు